లింకు నొక్కితే.. ఖాతా ఖాళీ!



- పట్టణానికి చెందిన ఓ హోటల్ నిర్వాహకుడి అల్లుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వర్క్‌ఫ్రమ్‌హోమ్ చేస్తున్నాడు. తరచూ ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేస్తుంటాడు. ఇటీవల ఓ అజ్ఞాత వ్యక్తి అతని సెల్‌కు ఓ లింకు మెసేజ్ పంపాడు. 'మీ పర్ఫార్మెన్స్ బాగుంది.. మా కంపెనీలో పనిచేస్తే ఏడాదికి రూ.కోటి ఇస్తాం' అంటూ ఆఫర్ చేశారు. ఆశపడి వెంటనే లింక్ క్లిక్‌చేశాడు. ఖాతాలో ఉన్న రూ.4 లక్షలు క్షణాల్లో మాయమైపోయాయి. ఇదేంటనీ ప్రశ్నిస్తే డిపాజిట్ కోసం తీసుకున్నాం. మీరు అసిస్టెంట్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. నెలకు జీతం రూ.3 లక్షలు ఉంటుందన్నారు. ప్రాసెసింగ్ ఫీజు పేరుతో మరో రూ.6 లక్షలు గుంజారు. ఇలా రూ.10 లక్షలు మోసపోయి అప్పుల పాలయ్యారు.
- పట్టణంలోని పార్వతీనగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్‌చేస్తూ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కాడు. ఏడాదికి రూ.2 కోట్లు ఆఫర్ చేసి ఆశల వలలోకి దించారు. లింకు పంపి రూ.10 లక్షలు నొక్కారు. ఆ తర్వాత తన ఖాతాలన్నింటినీ హ్యాక్‌చేసి మరో రూ.5 లక్షలు కాజేశారు. మొత్తం రూ.15 లక్షలు పోగొట్టుకుని ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు.
- పట్టణంలోని బళ్లారి రోడ్డుకు చెందిన ఓ వివాహిత సెల్‌కు హాయ్ అంటూ ఓ మెసేజ్ వచ్చింది. ఎవరో కనుకున్నేందుకు రిప్లై మెసేజ్ పంపింది. అంతే ఖాతాలోని రూ.90 వేలు సైబర్ నేరగాళ్లు దోచేశారు. ఇది పది రోజుల క్రితమే జరిగింది. భర్తకు తెలిస్తే ఏమవుతుందోనన్న భయంతో పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసింది.

ఈ ముగ్గురే కాదు.. నిత్యం ఏదో ఓ చోట ఇలాంటి సైబర్ క్రైమ్‌లు వెలుగు చూస్తూనే ఉన్నాయి. చదువుకున్న వారి పరిస్థితే ఇలా ఉంటే చదువే లేని వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- క్షణాల వ్యవధిలో మాయమైపోతున్న నగదు
- పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు

రాయదుర్గం: రోజు రోజుకూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఫోన్లు చేసి మీ బ్యాంకు ఖాతా బాక్ అయిందని, .. మీ సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని .. మీకు లక్కీ డ్రాలో బహుమతి వచ్చిందంటూ వ్యక్తిగత వివరాలు అడగడం, ఫేస్‌బుక్ హ్యాక్‌చేసి డబ్బులు డిమాండ్‌చేయడం.. ఏపీకే, ఇతర లింకులు పంపి ఖాతాల్లోని నగదు ఖాళీ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో నిత్యం ఏదో ఓ చోట సైబర్ మోసాలకు గురవుతున్నారు. గత ఆరు నెలలుగా సుమారు 400 మందికి పైగా ఇలాంటి ఫిర్యాదులతో పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది.

సొంతంగా నకిలీ సైట్లు

ప్రస్తుతం అందరి వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. తక్కువ ధరకే నెట్ సేవలు అందుతున్నాయి. పల్లె నుంచి పట్నం వరకూ ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటితో డిజిటల్ లావాదేవీలు ఎక్కువయ్యాయి. ఇవన్నీ ప్రైవేటు సంస్థలకు చెందినవే. మన సమాచారమంతా వారి చేతుల్లో ఉంటోంది. దీన్నే అదునుగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, మెస్సేజ్ తదితర వాటి లింకు నొక్కగానే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు చేజారిపోతోంది. సైబర్ నేరగాళ్లే సొంతంగా సైట్‌లను తయారు చేస్తుండడంతో అసలేవో? నకిలివేవో? తెలియక ప్రజలు మోసపోతున్నారు. కొంతమంది ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా పోగొట్టుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ సైబర్ వారియర్లను నియమించాం. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలి. అనుమానిత లింక్‌లను ఎలాంటి పరిస్థితుల్లోనూ తెరవకూడదు.

– వెంకటరమణ, రూరల్ సీఐ, రాయదుర్గం

ఈ జాగ్రత్తలు పాటించాలి

- సెల్‌ఫోన్‌కు వచ్చే లింకు జాగ్రత్తగా గమనించి తెరవాలి.
- యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంకు ఖాతాల్లో తక్కువగా డబ్బు ఉండేలా చూసుకోవాలి.
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు అసలు తెరవకూడదు.
- గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు ఆధార్, ఓటీపీ వంటివి చెప్పకూడదు.
- గూగుల్ సెర్చ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- సైబర్ నేరం జరిగిన వెంటనే (24 గంటల్లోపు) 1930కి ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలి. లేకపోతే www.cyber.crime.go in లో ఫిర్యాదు చేయాలి.

క్లుప్తంగా

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి



నాగేంద్రప్పను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం: పోలేపల్లిలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకుల దాడిలో గాయపడి కళ్యాణదుర్గం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్రప్పను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రప్ప బుధవారం పరామర్శించారు. దాడికి గల కారణాలు తెలుసుకుని.. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ తరపున అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గంగాధరప్ప, మాజీ ఎంపీపీ మహదేవప్ప, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం రాహుల్, సర్పంచ్ శెట్టిగారి మంజునాథ, ఎంపీటీసీ నగేష్, నాయకులు ఎర్రంపల్లి క్రిష్ణమూర్తి, అంజి, జానీ, కేటీఆర్ మంజు, మహాత్మరెడ్డి, రాజు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కణేకల్లు: మండలంలోని మండలంలోని 43 ఉడేగోళంలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన వర్గీయుల మధ్య గొడవ జరిగింది. టీడీపీ నాయకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమనతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగమధు తెలిపారు. అలాగే వేమన ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలీఖాన్‌పై కేసు నమోదు చేసి కేసును విచారిస్తున్నామన్నారు. ఇదిలా ఉంటే .. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకుడు అల్లీఖాన్ తరచూ తమను చూసి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమన తెలిపారు. ఈ నేపథ్యంలోనే గొడవ జరిగిందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. బ్రహ్మసముద్రం హైస్కూల్ విద్యార్థిని జి.శివలింగమ్మ అండర్ -18 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, బి.నరసింహ, లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం పొందడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు త్వరలో గుంటూరు జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పీఈటీ ఇబ్రహీం తెలిపారు.

19న స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 19న (గురువారం) స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు మల్లికార్జున, ఈరన్న తెలిపారు. బుధవారం స్థానిక మండల ఎమ్మార్సీ కార్యాలయంలో పీఈటీలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన బాల, బాలికలకు అండర్-14, అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన ఎం. ఉపేంద్రను బుధవారం బొల్లనగుడ్డం చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనంతో పాటు 1152 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

కళ్యాణదుర్గం రూరల్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సత్యప్రసాద్‌ను ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించింది. ప్రధానోపాధ్యాయులు గంధం శ్రీనివాసులు మాట్లాడుతూ సత్యప్రసాద్ సేవలను కొనియాడారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కణేకల్లు: 'భావిభారత పౌరులను తీర్చిదిద్దేది గురువులే. అందుకే గురువులను సమాజ నిర్దేశకులు అంటారు' అని కణేకల్లు ఎంఈఓ-1 లక్ష్మన్న, ఎంఈఓ-2 భవానీశంకర్ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ స్కూల్‌లో బుధవారం ఉత్తమ అవార్డుగ్రహీతలైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవముందని, ఆ గౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి ఉపాధ్యాయుని బాధ్యతన్నారు. అనంతరం హెచ్‌ఎంలు నారాయణ స్వామి (43 ఉడేగోళం), వెంకటేశ్వర్లు (తుంబిగనూరు), ఉపాధ్యాయులు సర్దానప్ప (పులచెర్ల), వైఎస్ వేణుగోపాల్ (పెనకలపాడు) చంద్రమున్నయ్య (పెనకలపాడు)లను సత్కరించారు. ఆ తర్వాత ఇటీవల పదవీవిరమణ పొందిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులతో పాటు స్థానిక ఉపాధ్యాయులు టీ.శేషారెడ్డి, మహమ్మద్ గౌస్‌పీర్, లక్ష్మీదేవీలను కూడా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులను అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు హనుమప్ప, రాష్ట్ర కార్యవర్గసభ్యులు టీ.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ తీరుపై కోర్టు మెట్లెక్కిన మున్సిపల్ ఆర్ఓ

- స్టే విధించిన హైకోర్టు
- కౌంటర్ దాఖలుకు ఆదేశాలు



కొండన్న, ఆర్ఓ

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీలో రెవెన్యూ విభాగం అధికారిగా (ఆర్ఓ) పనిచేస్తున్న ఎస్.కొండన్న తన బదిలీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారుల తీరుపై హైకోర్టు మెట్లెక్కారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాయదుర్గం నుంచి కడప జిల్లా కమలాపురం నగర్ పంచాయతీకి ఆర్ఓ కొండన్నను బదిలీ చేశారు. కానీ కొండన్న ఇక్కడి నుంచి రిలీవ్ కాకుండా మున్సిపల్ డీఎంఏ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయమై బుధవారం కొండన్న మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ సాధారణ బదిల్లో భాగంగా ఇక్కడి నుంచి తనను ఆర్ఓ పోస్టు ఖాళీగా ఉన్న ధర్మవరం, గుత్తి, తాడిపత్రి మున్సిపాలిటీలో ఏదో ఒక మున్సిపాలిటికి బదిలీ చేయాలని మూడు ఆప్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. కానీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కమలాపురంకు బదిలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానన్నారు. విచారించిన హైకోర్టు ఆర్ఓ బదిలీ ప్రక్రియపై స్టే విధించి నాలుగు వారాల్లో మున్సిపల్ ఉన్నతాధికారులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిందన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే మంచి దిగుబడులు



ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ కృష్ణతేజ

బెళుగుప్ప: రైతులు ఉద్యాన పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధ్యమని మండల ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి, చీనీ, పూలతోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో సమగ్ర సస్యరక్షణ, చీడపీడల నివారణ, పంటల సాగుకు ప్రభుత్వ తోడ్పాటు పథకాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 15లోపు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని హెచ్ఓ పేర్కొన్నారు.

కణేకల్లు: సస్యరక్షణ చర్యలతోనే వరిలో మేలైన దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ శ్రీనివాసులు, కణేకల్లు ఏఓ ఎ.శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం వరిసాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

కనుల పండువగా మారెమ్మ జాతర



బెళుగుప్ప తండాలో సిడిమాను ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) గౌరసంద్రం మారెమ్మ

బెళుగుప్ప: బెళుగుప్ప తండాలో బుధవారం గౌరసంద్రం మారెమ్మ, టుకరి బనికి అమ్మవారి జాతరలో భాగంగా నిర్వహించిన సిడిమాను ఉత్సవం ఆకట్టుకుంది. కర్ణాటకలోని గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో ఏటా జరిగే జాతరను పురస్కరించుకుని బెళుగుప్ప తండాలో కూడా మారెమ్మ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మారెమ్మ, టుకరి బనికి అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం బోనాలు సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకుడు చంద్రానాయక్.. సిడిమానుపై కూర్చొని చుట్టూ తిరుగుతూ భక్తులపై పూలు చల్లి ఆశీర్వదించారు.

ఘనంగా మారెమ్మ ఉత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం, గొల్లపల్లి, గొనిగుంట, అడిగుప్ప గ్రామాల్లో మారెమ్మద ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేర్చాలని అమ్మవారిని వేడుకున్నారు.

నిర్లక్ష్యం చేశారు.. నిండా ముంచారు

- వరదపై సమాచారం ఉన్నా చర్యలు శూన్యం
- ప్రభుత్వ ముందుచూపు లేకపోవడంతో 47 మంది బలి
- చంద్రబాబువి నీచ రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి





మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: బుడమేరు వరదను అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా విజయవాడ శివారు ప్రాంతాలను వరద ముంచిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలపై వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అలాగే బుడమేరు వరదను దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. వరద 47 మంది ప్రాణాలను (ప్రభుత్వ లెక్కల ప్రకారం) బలిగొందన్నారు. వాతావరణ శాఖ, ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించి ఉంటే ప్రాణ నష్టం తప్పేదన్నారు. నేను విజనరీ అని గొప్పలు చెప్పుకునే సీఎం చంద్రబాబు వరదను అంచనా వేయడంలో విజనరీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. విపత్కర పరిస్థితుల్లో అండగా ఉండాల్సిన ప్రభుత్వం నీచ రాజకీయాలకు దిగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లు, రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగి పోతాయన్న భయంతో అధికారులు అర్ధరాత్రి బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటరీ ద్వారా విజయవాడ మీదుగా నీరు వదిలేశారన్నారు. లక్షలాది మంది జనం వరదల్లో చిక్కుకుని అల్లాడిపోతుంటే మానవత్వంతో స్పందించాల్సిన చంద్రబాబు, మంత్రులు, వారి ఎమ్మెల్యేలు ప్రచార ఆర్భాటం చేస్తూ ఫొటోలకు పోజులు ఇస్తున్నారని మండిపడ్డారు. వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు, తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసుకోరావడం మాని, బోట్లలో వెళుతూ చంద్రబాబు షో చేశారని మండిపడ్డారు. విజయవాడలో పద్మావతి ఘాట్ నుంచి యనమల కదురు వరకూ నదిని ఆనుకుని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.474.51 కోట్లతో 5.66 కి.మీ మేర రక్షణ గోడ నిర్మించకపోతే ఇప్పుడు పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయమేస్తోందన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప: మండల పరిధిలోని కోనంపల్లి గ్రామానికి చెందిన వన్నూరు స్వామి (32) బుధవారం కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడ్డ 27 ద్విచక్రవాహనాలను బుధవారం కళ్యాణదుర్గం సెబ్ స్టేషన్ ఆవరణలో సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ పర్యవేక్షణలో వేలం వేశారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3,18,600 ఆదాయం వచ్చిందన్నారు.



ఉరవకొండలో నేత్రపర్వంగా సాగుతున్న గణేష్ శోభాయాత్ర



లక్ష్మీబజార్‌లో వెలసిన వినాయకుడి శోభయాత్ర

గంగ ఒడికి గౌరీపుత్రుడు

సాక్షిబృందం: రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ప్రత్యేక వాహనాల్లో గణేష్ ప్రతిమలను కొలువుదీర్చి డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువులు, కుంటలు, హెచ్చెల్సీ కెనాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



గంగమ్మబావి వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



రంగావీధిలో కేరింతలు కొడుతున్న యువత

వైభవంగా మారెమ్మ జాతర



ముచ్చర్లపల్లిలో మారెమ్మను దర్శించుకున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

శెట్టూరు: మండలంలోని శెట్టూరు యాదవపురం, ముచ్చర్లపల్లి మారెమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో కళకళలాడింది. మారెమ్మ గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. యాదవపురంలో మాజీ సర్పంచ్ వీరభద్రప్ప, ముచ్చర్లపల్లి విజయ్‌కుమార్‌ల ఆహ్వానం మేరకు విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు తిప్పేస్వామి, నండిమింటి కిష్టప్ప, హరికృష్ణ, గోపి, నాగేంద్ర, వెంకటేశులు, పోస్ట్ రామకృష్ణ, తిప్పేస్వామి, ఎమ్మెఎస్ రాయుడు, హరినాథరెడ్డి, వీరాంజినేయులు, లింగప్ప, టైలర్ వన్నూరుస్వామి, మాదయ్య, జైరాములు, ఆంజనేయులు, పెద్ద కిష్టప్ప, రంగన్న, హనుమప్ప, చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

13న డయల్ యువర్ డీఎం

రాయదుర్గంటౌన్: ఏపీఎస్‌ఆర్టీసీ రాయదుర్గం డిపో పరిధిలో ఈ నెల 13న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.సురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డీఎం జరుగుతుందన్నారు. ఆర్టీసీ రవాణా సౌకర్యం, సమస్యలు, సలహాలు, సూచనలను ఫోన్ నంబర్ 9959225863 తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని రాయదుర్గం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల రక్తనమూనాల సేకరణ

బెళుగుప్ప: గొర్రెలు మేకలులాంటి జీవాలు రెండు శాతం కన్నా ఎక్కువగా ఈసుకుపోవడం (అబార్షన్ కావడం)పై కాపరులు జాగ్రత్తగా ఉండి చర్యలు చేపట్టాలని మండల పశువైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీరంగాపురంలో రైతు జయరాంకు చెందిన ఒకే జీవాల గుంపులో సుమారు 20 గొర్రెలు పైగా ఈసుకుపోవడంతో బుధవారం మందను పశువైద్యాధికారి పరిశీలించారు. వ్యాధి నిర్ధారణకు 20 గొర్రెలు, మరో ఎనిమిది విత్తన పొట్టేళ్ల రక్త నమూనాలను సేకరించి కళ్యాణదుర్గం ప్రాంతీయ వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు మారుతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆర్డీటీ చేయూత

వజ్రకరూరు: మహిళ ఆర్థికాభివృద్ధికి ఆర్డీటీ చేయూత అందిస్తున్నట్లు ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీచరిత మహిళా సహాయ సహకార పొదుపు-పరపతి సంఘం లిమిటెడ్ (మహిళా బ్యాంకు) ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 101 మంది మహిళలకు రూ.14,20,800 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. గొర్రెలు, మేకల పెంపకం, గేదెలు, ఆవులు పాడిపశువుల అభివృద్ధికి మహిళా బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

లడ్డు వేలం

రాయదుర్గంటౌన్: వినాయక సర్కిల్ వినాయక సేవా సమతి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జరిగిన స్వామి వారి లడ్డు వేలం పాటలో కొండాపురం శ్రీరాములు అనే వ్యక్తి రూ.36,116లకు లడ్డును దక్కించుకున్నాడు. స్వామి వారి పూలహారం, శేషవస్త్రాలను రూ.2500లకు కెరే వినాయక దక్కించుకున్నాడు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

ఉరవకొండ: మండల పరిధిలోని రాయంపల్లి, వ్యాసాపురం, నెరిమెట్ల ఆర్బీకేల పరిధిలోని రైతులకు బుధవారం ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ మాట్లాడుతూ.. 80 శాతం రాయితీతో ఉలవలను రైతులకు అందిస్తున్నామన్నారు.